ఓవైపు నాటుడు.. మరోవైపు నరుకుడు


గున్‌గల్‌లో మొక్కలు నాటుతున్న మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణయాదవ్ తదితరులు


చౌదర్‌పల్లిలో చెట్లను నరికి వేసిన ట్రాన్స్‌కో సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ దినోత్సవం రోజున యాచారం మండలంలో రెండు కార్యక్రమాలు చేపట్టారు. గురువారం యాచారం, చౌదర్‌పల్లి, మాల్, కొత్తపల్లి, తదితర గ్రామాలలో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను అడ్డంగా నరికేస్తుంటే.. మరోవైపు గున్‌గల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, యాచారం, నందివనపర్తి తదితర గ్రామాలలో అధికారులు, పాలకులు మొక్కలు నాటారు. ఓ పక్క నాటడమెందుకు.. మరోవైపు నరకడమెందుకని ప్రజలు ప్రశ్నించారు. మొక్కలు నాటే సమయంలో సరైన ప్రాంతాలు ఎంచుకుంటే ఈ ఇబ్బందులు తలెత్తవు కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యాచారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి)


కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

‘భూ భారతి’ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌ఓఆర్ భూ భారతి చట్టం 2025ను అమలు చేస్తోందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని గొల్లపల్లి ఖుర్దులో తహసీల్దార్ రవీందర్ దత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 14లోపు అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం రైతుకార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ హెల్ప్‌డెస్క్, జనరల్ డెస్క్‌ల వద్ద సదుపాయలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు పలువురు రైతులు భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే కాలె

చేవెళ్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యమివ్వాలని ఢిల్లీలో గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్, మానకొండూరు, తుంగతుర్తి ఎమ్మెల్యేలు సత్యనారాయణ, శామ్యూల్ ఉన్నారు.

కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యమివ్వండి

» మీనాక్షి నటరాజన్‌కు ఎమ్మెల్యే వినతి


రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యతమివ్వాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆగీరు రవికుమార్‌లకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి అంకితమై పనిచేస్తున్న కొత్తూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.జగదీశ్వర్, జానంపేట నాగమణి, మహ్మద్ ఇబ్రహీం, రాయికంటి కృష్ణారెడ్డి, జర్పుల నెహ్రూనాయక్, బాదేపల్లి సిద్ధార్థ, జిల్లెల రాంరెడ్డిల పేర్లను కూడా పరిశీలించాలని విన్నవించారు.

డీఎస్‌ఆర్ పంచాయితీ

సర్కార్‌తో గ్రామ కార్యదర్శుల అమీతుమీ

గ్రామ పంచాయతీల్లో పరిపాలన మెరుగు పరచడంతో పాటు కార్యదర్శుల పనితీరులో పారదర్శకత తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్టు) యాప్‌ను ఇటీవల అమల్లోకి తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్ ప్రభుత్వానికి, పంచాయతీ కార్యదర్శుల మధ్య సరికొత్త వివాదానికి తెర తీసింది. యాప్‌లో అటెండెన్స్‌తో పాటు ప్రభుత్వం సూచించిన ఇతర వివరాలను, ఫొటోలు అప్‌లోడ్ చేయలేమని కార్యదర్శులు లడాయ్‌కి దిగారు. యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్నిరోజులుగా హాజరు నమోదు చేయకుండా నిరసన తెలుపుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. కాగా, ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి మంది కార్యదర్శులు ఆందోళన బాట పట్టారు.

- ఉదయం హాజరుపై వ్యతిరేకత
- డీఎస్‌ఆర్ యాప్ బహిష్కరణ
- 20 రోజులుగా అటెండెన్స్ వేయని వైనం
- షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఉన్నతాధికారుల నిర్ణయం



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

పంచాయతీల్లో పాలన మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన ‘డీఎస్ఆర్’(డైలీ శానిటేసన్ రిపోర్టు) యాప్ కొత్త వివాదానికి తెరతీసింది. ఈ యాప్ వల్ల పారదర్శకత, పనితీరు మెరుగుపడుతుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ దీన్ని అమలు చేయాల్సిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు యాప్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తూ ఆందోళన బాట పట్టారు. గడిచిన 20 రోజుల నుంచి యాప్ ద్వారా నమోదు చేయాల్సిన అటెండెన్స్ కూడా వేసుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు వేయి మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆందోళనలో పాల్గొంటున్నారు. బేషరతుగా ప్రభుత్వం ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు యాప్‌లో అటెండెన్స్‌తో పాటు ప్రభుత్వం సూచించిన ఇతర వివరాలను, ఫొటోలు కూడా అప్‌లోడ్ చేయరాదని తీర్మానించారు. ఇదిలా ఉంటే గ్రామ కార్యదర్శులు యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోకుంటే సీఎల్‌గా పరిగణించాలని డైరెక్టర్

మిగతా 7వ పేజీలో...

అభ్యంతరాలు ఇవే..

ఈ యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఏ ప్రభుత్వ శాఖలో పనిచేసే సిబ్బందికి లేని విధంగా తమను మాత్రమే ఉదయం 7గంటలకే విధులు హాజరు కావాలని ఆదేశించడం తగదంటున్నారు. అలాగే పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అన్ని పనుల భారం తమపైనే పడుతుందని వాపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రాజీవ్ వికాసం దరఖాస్తుల పరిశీలనతో పాటు గ్రామంలో అన్ని పనులు తామే నిర్వహించాల్సి వస్తుందని చెబుతున్నారు. దీంతో ఉదయం 7గంటలకే వచ్చి ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా హాజరు వేసుకోవడం, ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయడం కష్టతరంగా ఉందని అంటున్నారు. మా వ్యక్తిగత అవసరాల కోసం కొనుగోలు చేసుకున్న ఫోన్లలో ఇప్పటికే 10 వరకు ప్రభుత్వ యాప్‌లను నిర్వహిస్తున్నామని, ఈ కారణంగా అపుడప్పుడు ఫోన్లు హ్యాంగ్ అయి పనిచేయక ఇబ్బందులు పెడుతున్నాయంటున్నారు. ఇవి చాలదన్నట్లుగా ప్రభుత్వం డీఎస్ఆర్ యాప్ తీసుకువచ్చి రోజూ ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించడంతో అసలు పనిచేయడమే కష్టంగా మారిందని వాపోతున్నారు. మా వ్యక్తిగత సమాచారం కూడా థర్డ్‌పార్టీ యాప్‌కు వెళ్లే అవకాశం ఉందని, మహిళా కార్యదర్శులు సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుకునే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఉన్న యాప్‌లో కూడా వివరాలు నమోదు చేసేవారు. అయితే కొందరు గ్రామ కార్యదర్శులు ఏదో ఒక ఫొటో పెట్టి ఆ రోజుకు మమ అనిపించే వారు. ఇలాంటి వారి ఆటకట్టించేందుకే ఈ యాప్ తీసుకువచ్చామని అధికారులు చెబుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, హాస్టళ్లు తెరిచే వరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురురువారం రాత్రి కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ అంగన్‌వాడీ కేంద్రాలు ఓపెన్ అవుతున్నందున 11వ తేదీ వరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. యువ వికాసంలో అందరూ ఒకే రకమైన యూనిట్లు ఎంపిక చేసుకోకుండా బార్బర్, టెంట్‌హౌస్, మహిళలు బ్యూటీ పార్లర్లు ఎంపిక చేసుకునేలా చూడాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, హౌజింగ్ పీడి హన్మంతు నాయక్, ఎంపిడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



పంట మార్పిడి.. అధిక దిగుబడి

వేర్వేరు పంటల సాగుతో
రైతులకు మేలు
కలిసిరానున్న పెట్టుబడి
అదుపులో చీడపీడలు

7

ఇంటింటికీ మాస్టార్లు!

నేటి నుంచి బడిబాట కార్యక్రమం

- 19వ తేదీ వరకు రోజుకో ప్రోగ్రామ్
- ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా 1,341 పాఠశాలలు

రంగారెడ్డి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుదలే లక్ష్యంగా విద్యాశాఖ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమైంది. జూన్ 6 నుంచి 19వ తేది వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉపాధ్యాయులు బడిబయట ఉండే పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటికీ వెళ్లనున్నారు. పాఠశాలలు సాధించిన ప్రగతి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై ప్రచారం చేయనున్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని విజయవతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా..

జిల్లా వ్యాప్తంగా 1,341 పాఠశాలు ఉండగా 1,38,969 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను 20 శాతం పెంచాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే సర్కారు బడులపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి నమ్మకం పెంచేందుకు

మిగతా 8వ పేజీలో...


ఆదిభట్లలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)



ప్రవేశాలు పెంచడమే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంపొందించమే లక్ష్యంగా జూన్ 6 నుంచి 19వ తేది వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. ప్రణాళికను పాటిస్తూ, ఎక్కువ మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

- సుశీంద్రరావు, డీఈవో

విత్తనాల పంపిణీతో రైతులకు మేలు

యాచారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతులను ఆర్థికంగా ప్రోత్సహించడానికి ఈ ఏడాది వరి, జొన్న విత్తనాలను కంపెనీ ధరల కంటే తక్కువకు అందిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు గురువారం ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడుతూ జిల్లాలో 1069 వరి విత్తనాల కిట్లు, 86 జొన్న విత్తనాల కిట్లు రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ విత్తనాల ఒక బస్తాను రూ.50కు అందజేస్తామన్నారు. ఎరువులు, విత్తనాల కొరత చూస్తున్నామన్నారు. ఎరువులు బ్లాక్‌లో విక్రయించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులను ఈపాస్ ద్వారా అందిస్తున్నామన్నారు.

నాటుకోళ్ల షెడ్‌పై వీధికుక్కల దాడి

» 300 కోళ్లు మృతి.. సుమారు రూ.3 లక్షల నష్టం
» నందిగామ మండలంలో ఘటన



నందిగామ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నాటుకోళ్ల షెడ్‌పై వీధికుక్కలు దాడి చేసిన ఘటనలో సుమారు 300 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన నందిగామ మండల పరిధిలోని రంగాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రంగాపూర్ గ్రామానికి చెందిన వనపల్లి మల్లేశ్ గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో షెడ్డు నిర్మాణం చేసి నాటుకోళ్ల పెంపకాన్ని చేపట్టాడు. బుధవారం రాత్రి వేళ పదుల సంఖ్యలో వీధి కుక్కలు షెడ్డుపై దాడిచేశాయి. ఈ దాడిలో సుమారు 300 కోళ్లు మృతి చెందినట్లు రైతు మల్లేశ్ తెలిపారు. కోళ్లపై కుక్కలు దాడి చేయడంతో షెడ్డు లోపల, షెడ్డు బయట కోళ్ల కళేబరాలు చిందరవందర పడ్డాయి. అమ్మకానికి సిద్ధంగా ఉన్న కోళ్లు ఒక్కసారిగా ఇలా మృతి చెందడంతో రైతు మల్లేశ్ లబోదిబోమంటున్నాడు. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వచ్చినట్లు, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన బోరున విలపిస్తున్నాడు.

‘శంకర్‌పల్లి’కి పురస్కారం

ఉత్తమ పర్యావరణ అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ యోగేశ్

శంకర్‌పల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిని ఉత్తమ పర్యావరణ అవార్డు వరించింది. దీనిని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ అందుకున్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో గురువారం జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనాన్ని ప్రోత్సహించడం తదితర చర్యలతో రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలి శంకర్‌పల్లి మున్సిపాలిటీని అవార్డుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. కాగా మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, కార్యదర్శి రవి, పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ చేతుల మీదుగా కమిషనర్ యోగేష్ అవార్డును అందుకున్నారు.


మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కమిషనర్ యోగేశ్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తలకొండపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కార్యదర్శులు బుగ్గ రాములు, బి.రామలయ్య అన్నారు. బడిబయట ఉన్న పిల్లలందరినీ గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారు కోరారు. తలకొండపల్లి, చుక్కాపూర్ గ్రామాల్లో గురువారం బడిబాట ప్రచార జాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి స్కూళ్లకు పోని పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో టీచర్లు మాట్లాడుతూ.. స్థానికుల సహకారంపైనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, నోటు బుక్కులు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తే తల్లిదండ్రులకు వేల రూపాయల ఆర్థిక భారం పడుతుందన్నారు. తమ పిల్లలకు సర్కారు బడిలోనే చేర్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో ఫలితాలొస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, మహేశ్వరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆంజనేయులు, నరసింహామూర్తి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తలకొండపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గులాబీ సాగు.. లాభాలు బాగు

● ఎకరానికి నెలకు రూ.లక్ష వరకు ఆదాయం!


చించోడులో గులాబీ తోట

షాద్‌నగర్ రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటుతో ఊరుతో పాటు భూములూ కోల్పోయిన ఓ రైతు వేరే గ్రామంలో భూమి కొని గులాబీ సాగుతో లాభాలు అర్జిస్తున్నాడు. శంషాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన సిద్ధులు, మరో ఇద్దరు సోదరులకు మూడెకరాల భూమి ఉండేది. శంషాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం భూసేకరణలో వారి భూమి పోయింది. పరిహారం కింద ఒక్కొరికి రూ.3లక్షలొచ్చాయి. ఆ డబ్బుకు కొంత జమచేసి అప్పట్లో ఫరూక్‌నగర్ మండలం చించోడులో రెండెకరాలు కొన్నారు. ఈ రెండేళ్ల క్రితం ఈ రెండెకరాల్లో 7వేల గులాబీ మొక్కలు నాటారు. రూ.25 ఒక మొక్క చొప్పున కొన్నారు. మొక్కలు నాటే సమయంలో రైతు మెలకువలు పాటించారు. ఎకరానికి మూడు టిప్పర్ల పశువుల ఎరువు తోడారు. దానిపై పల్చగా మట్టివేసి మొక్కలు నాటారు. ప్రస్తుతం గులాబీ పూలు విచ్చుకొని రెండో కోత కోస్తున్నాడు.

పూలకు ధర ఉంటే భారీ ఆదాయం

సీజన్‌లో ఎకరా విస్తీర్ణంలోని పూలను అమ్మితే నెలకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఒక వేళ ధర కొంత తక్కువున్నా రూ.50వేలకు తగ్గదంటున్నారు. సీజన్‌లో కిలో పూలకు రూ.200 నుంచి రూ.250 వస్తుందని తెలిపారు. సీజన్ లేకున్నా కిలో రూ.50 తక్కువ ఉండదంటున్నారు. తమ రెండు ఎకరాల్లో రోజూ పది మంది కూలీలు పూలు తెంపేందుకు, ఇతరాలను పనిచేస్తారన్నారు. ఒక్కో మహిళా కూలీకి రోజుకు రూ.300 ఇస్తున్నారు. ఉదయం 9గంటలకొచ్చి సాయంత్రం 6గంటలకు వరకు పనిచేస్తారన్నారు. వారితో పాటు రైతు కుటుంబీకులూ పనిచేస్తారు. సిద్ధులు దంపతులు రోజూ ఉదయం శంషాబాద్ నుంచి చించోడ వచ్చి గులాబీ పూలను గుడిమల్కాపూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాడు. ఓపికగా పని చేసుకుంటే గులాబీ సాగులో మంచి లాభాలే వస్తాయని సిద్ధులు చెప్పాడు. పూలరెమ్మలు రాలకుండా ఉండేందుకు నెలలో రెండుసార్లు మందు పిచికారి చేస్తామన్నారు. అలా చేస్తే పది రోజులైనా పూల రెమ్మలు రాలవని, పూలు తాజాగా ఉంటాయని రైతు తెలిపాడు.

మెలకువలు పాటించాలి



గులాబీ సాగుకు భార్యాభర్తలం కష్టపడి పని చేసుకుంటాం. ఉదయమే పొలానికి వస్తాం. పూల తోటను కంటికి రెప్పలా చూసుకుంటాం. మిగతా పంటలతో పోలిస్తే గులాబీ సాగులో ప్రత్యేక మెలకువలు పాటించాలి. అది మరీ కష్టమేమీ కాదు. గులాబీ చేనుకు చీడపీడల బెడద ఎక్కువగా ఉండదు. ఈ పంటతో లాభాలు బాగానే ఉంటాయి. పూలను సులభంగానే మార్కెటింగ్ చేసుకోవచ్చు. పూల సాగులో సాధారణంగా నష్టమయితే ఉండదు.

- సిద్ధులు, గులాబీ రైతు, చించోడు

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలి



శిబిరంలో మెడికల్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమనగల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి):పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు రావని ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ మంజులాదేవి తెలిపారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లిలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో వైద్యులు టీబీ, ఎయిడ్స్, షుగర్, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరంలో 198మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ రచనాసింగ్, శ్రీకాంత్, వైద్య బృందం నాగేశ్వరీ, విజయ్‌కుమార్, హలీం, భారతమ్మ, గోపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సౌదీ నుంచి తండాకు చేరిన మృతదేహం


బాబ్య మృతదేహం వద్ద కుటుంబీకులు

చౌదరిగూడ, జూన్5(ఆంధ్రజ్యోతి):బతుకు దెరువు కోసం సౌదీ వెళ్లి మే 27న గుండెపోటుతో అక్కడే మృతిచెందిన హెమ్లాతండా వాసి బాబ్య మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది. బాబ్య మృతదేహాన్ని తండాకు తరలించేలా సహకరించాలని తండా వాసులు రవి, కిషన్, రామ్‌చరణ్, వినోద్ రమేష్, వెంకట్, పాండునాయక్‌లు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య, ఎమ్మెల్యే కేటీఆర్‌లకు విన్నవించారు. వారు అక్కడి అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేలా కృషి చేసినట్లు తండా వాసులు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ కార్యకర్తగానూ పనిచేసిన బాబ్య కుటుంబానికి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే అండగా నిలవడం గొప్ప విషయం అని వారు అన్నారు.

రాక్‌వుడ్స్ స్కూల్ అధినేతకు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న రామానాయుడు

ఘట్‌కేసర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):పోచారం పరిధి యంనంపేట్‌లో గల రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్, ఓనస్ రొబోటిక్ హాస్పిటల్స్ చైర్మన్ ఎం.రామానాయుడు ఎక్సలెన్స్ అవార్డ్-2025 అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం యాదాద్రిలో ఇండో-యూకే గ్రీన్ డ్రైవ్ కార్యక్రమంలో గ్యారెత్‌విన్ ఓవెన్(బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్), స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యల నుంచి అవార్డును అందుకున్నారు. విద్యారంగం, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్య రంగాల్లో ఆవిష్కరణల అంశాల్లో రామానాయుడు చేస్తున్న కృషికి ఫలితంగా ఈ అవార్డు దక్కిందని సంస్థల ప్రతినిధులు తెలిపారు. స్కూళ్ల నిర్వహణతో ఉత్తమ పౌరులను తయారు చేయడం, ఓనస్ రొబోటిక్ హాస్పిటల్స్ ద్వారా రోబోటిక్ సర్జరీలకు పునాది వేసే ప్రయత్నాలు చేస్తున్నందుకు అవార్డు వచ్చిందన్నారు. అవార్డుతో తనపై గురుతర బాధ్యత పెరిగిందని రామానాయుడు అన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి


అర్చనను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుల్లో రాణించాలని పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. గ్రామానికి చెందిన కె.అర్చన ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 546/600 మార్కులు సాధించి, గ్రామీణ ప్రగతి ఉపకారవేతనానికి ఎంపికైంది. విద్యార్థినిని గురువారం మాజీ సర్పంచ్, గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అర్చన తండ్రి ఆంజనేయులును అభినందించారు. కార్యక్రమంలో నరేందర్‌జీ పాల్గొన్నారు.

గిర్మాపూర్‌లో కంటి వైద్య శిబిరం

మేడ్చల్ టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బస్తీ దవాఖానా ఆవరణలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమై వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కాంట్రోల్ అధికారులు

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

క్వాలిటీ కంట్రోల్ డీఈ రజినీబాబు

ఆదిభట్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్) రజినీబాబు అన్నారు. మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ నుంచి రాచలూర్ వరకు రూ.30కోట్లతో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించి, నిబంధనల మేరకు పనులు చేయాలని సూచించారు. రోడ్డు మధ్యలో వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మిస్తున్న కల్వర్టుల కొలతలను పరిశీలించామన్నారు. ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ ఏఈ ప్రశాంతి, ఇబ్రహీంపట్నం ఆర్‌అండ్‌బి ఏఈ వినోద్‌కుమార్, కాంట్రాక్టరు ఉన్నారు.


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

చౌదరిగూడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దేవతామూర్తుల ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. గురువారం మండలంలోని రావిర్యాల పంచాయతీ పరిధి వీరసముద్రంలో సీతారామస్వామి, శివలింగం, ఆంజనేయస్వామి, నవగ్రహ, నాభిశిల ప్రతిష్ఠ కార్యక్రమాలను రెండో రోజు పూజారి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవతామూర్తుల ధాన్యాదివాసం, జలాదివాసంనిర్వహించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భాస్కరయోగి, తదితరులు

'రమణ మహర్షి జీవిత చరిత్ర' పుస్తకావిష్కరణ

షాద్‌నగర్ అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు కర్ణకోట రాజాజీ రచించిన 'శ్రీ రమణ మహర్షి జీవిత చరిత్ర' పద్య కావ్యాన్ని ప్రముఖ కవి భాస్కరయోగి ఆవిష్కరించారు. విజయనగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వేత్త రమణ మహర్షి, జగద్గురు శంకరాచార్యుల దారిలో ప్రయాణించి భక్తి భావాన్ని వ్యాప్తి చేశారన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ వంటి వారు రమణ మహర్షి ఆశీర్వాదం పొందారని తెలిపారు. రచయిత రాజాజీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు నాగుల యాదగిరి, జగదీశ్వర్, స్వరాజ్ బాబు, కర్ణకోట రవీంద్రనాథ్, నక్క నర్సింహులు, బాలగోపాల్, శంర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆమనగల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి, భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ పాటుపడుతోందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ఫౌండేషన్ లక్ష్యం అన్నారు. కడ్తాల్, ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో గురువారం రాఘవేందర్‌రెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జంగారెడ్డిపల్లిలో అంజనేయస్వామి నూతనాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి సుంకిరెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆయానికి ఫౌండేషన్ ద్వారా రూ.5లక్షలు అందించారు. నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఆలయాలభివృద్ధికి, దైవకార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. సేవా కార్యక్రమాల్లో ఐక్యత ఫౌండేషన్ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, అల్వాల్‌రెడ్డి, శ్రీధర్, పి.పరమేశ్వర్, ఎల్.తిరుపతయ్య, ఎల్.లాలయ్య, జి.బాలస్వామి, లింగం శ్రీను, బన్నె శ్రీను, బన్నె మల్లయ్య, ఎం.బుచ్చిరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛత కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది

పూడూర్‌లో స్వచ్ఛ భారత్

మేడ్చల్ టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పైప్‌లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణ పరిధి పూడూర్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కంపెనీ ఉద్యోగులు శివాలయ పరిసరాల్లో చెత్తను ఏరేసి శుభ్రపరిచారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

మోమిన్‌పేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాల ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పుస్తకాలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమేశ్, నాగేశ్వర్, సీఆర్పీలు శ్రీనివాస్, పిచ్చయ్య, సిబ్బంది జహంగీర్ పాల్గొన్నారు.

డీఎస్ఆర్ పంచాయితీ

(ఐదో పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ ఇటీవల ఆదేశించారు. అలాగే షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఒకవేళ ఇదే జరిగితే గ్రామ కార్యదర్శులంతా మూకుమ్మడి సెలవులోకి వెళ్తామని ప్రభుత్వానికి అల్టిమేటమ్ ఇచ్చారు. ఇప్పటికే పాలకవర్గాలు లేక డీలాపడిన పల్లెల్లో ఈ కొత్త యాప్‌వల్ల ప్రభుత్వానికి, గ్రామ పంచాయతీ కార్యదర్శుల మధ్య సరికొత్త వివాదానికి కారణమై పల్లె పురోగతిపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి పంచాయతీల్లో నిధులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలు నిధులకు కటకటలాడుతున్నాయి. దీంతో పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది. పాలకవర్గాలు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఏదో తిప్పలు పడి కొన్ని పనులు చక్కబెడుతున్నారు. కొన్ని నెలలుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో గ్రామ పంచాయతీకి అప్పుగా సామగ్రి ఇచ్చే దుకాణదారులు, ఫార్మ్‌లు ఎవరూ కూడా అప్పు ఇవ్వడం లేదని, పెట్రోల్ బంకుల్లో డీజిల్ పోయడం లేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామే సొంతంగా రూ.లక్షల్లో అప్పులు చేసి మరీ గ్రామ పంచాయతీలను నిర్వహించాల్సి వస్తుందని వాపోతున్నారు. మరోవైపు 2011 జనాభా లెక్కల ప్రకారమే సిబ్బంది ఉన్నారని, సరిపోను లేకపోవడంతో పనిభారం అనేక రెట్లు పెరిగిందని చెబుతున్నారు. యాప్ ద్వారా అన్ని పనులు చేయాలంటే ప్రతీ 100 మంది జనాభాకు ఒకరి చొప్పున సిబ్బందిని మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డీఎస్ఆర్ యాప్ ద్వారా...

గ్రామ పంచాయతీల్లో పరిపాలన మెరుగు పరచడంతో పాటు సిబ్బందిలో పారదర్శకత తెచ్చే పేరుతో ప్రభుత్వం 'డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్టు) యాప్‌ను ఇటీవల అమల్లోకి తెచ్చింది. గతంలోనే ఈ తరహా యాప్ అమల్లో ఉన్నప్పటికీ ఇటీవల దీనిలో అనేక మార్పులు తీసుకువచ్చారు. కొత్తగా తీసుకువచ్చిన యాప్ ప్రకారం ఉదయం 7గంటల నుంచి 8గంటల మధ్య కార్యదర్శి పంచాయతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ నుంచి ఫేస్ రికగ్నిజేషన్, లైవ్ లోకేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి. అనంతరం పంచాయతీ కార్యాలయం లోపల, బయట ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఉదయం 8గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా హాజరు పడదు. అలాగే గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, స్కూళ్లలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి వీటి ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పని సులభతరంగా ఉండేందుకు గ్రామాన్ని జోన్లుగా విభజించారు. అదే విధంగా రోజు వారీగా ఇంటింటికీ వచ్చేటటువంటి తడి, పొడి చెత్త వేరు చేయించి, వీటిని తూకం వేయించి, ఈ సమాచారాన్ని యాప్‌లో నిక్షిప్తం చేయాలి. పల్లె ప్రగతి పనులతోపాటు విద్యుత్ బిల్లులు, బర్త్, డెత్ వివరాలను నమోదు చేయాలి. అయితే ఉదయం 8గంటలకే హాజరు అనేదానిపై గ్రామ కార్యదర్శులు తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు. అయితే అధికారులు మాత్రం ఆలస్యంగా హాజరు నమోదు చేసిన వారి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని 9గంటల వరకు కూడా హాజరు నమోదు చేసుకోవచ్చని ఓ అధికారి తెలిపారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి

వేర్వేరు పంటల సాగుతో రైతులకు మేలు

కలిసిరానున్న పెట్టుబడి వ్యయం ● అదుపులో చీడపీడలు


చేవెళ్లలో టమాట తోట

చేవెళ్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వేసిన పంటలే మళ్లీమళ్లీ వేస్తూ రైతులు దిగుబడి నష్టపోతున్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించకుంటే చేలలో చీడపీడల వ్యాప్తి ఎక్కువవుతుంది. తరచూ ఒకే పంట సాగుతో భూమి నిస్సారంగా మారుతుంది. సహజ పోషకాలున్నీ వినియోగంకావు. ఈ సమస్యను అధిగమించేందుకు పంటమార్పిడి చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ పంటకు మార్పులు చేస్తే భూమిలోని సారం పూర్తిగా మొక్కలకు అంది దిగుబడి పెరుగుతుందంటున్నారు. పెట్టుబడీ ఖర్చూ తగ్గుతుంది. ఇంత కీలకమైన పంట మార్పిడి గురించి వ్యవసాయాధికారులు ఇంకా ఏమంటున్నారంటే..

పాటించాల్సిన మెలకువలు ...

- నేల ఉపరితలాన్ని కప్పేసే కొమ్మలు కలిగిన పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బెబ్బెర, పెసర, మినుము పంటలు నేలను కప్పి ఉంచుతాయి. నీడలో కలుపు మొక్కలు ఎక్కువగా పెరగవు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరుకు వేసుకుంటే సుడిదోమ, తుంగ్రోవైరస్‌లను అరికట్టొచ్చు.
- పత్తి సాగు చేసిన భూమిలో తదుపరి పంటగా మినుము, పెసర వంటివి వేస్తే తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది. వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగుచేయాలి. పసుపు తర్వాత వరి, జొన్న సాగు చేసుకోవాలి.
- నులి పురుగు సమస్య ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, పొగాకు వంగ పంటల సాగును కొంత కాలం నిలిపివేయాలి.

ఇలా చేసుకోవచ్చు

యాసంగిలో వేరుశనగ వేసిన చోట వానాకాలంలో మొక్కజొన్న వేసుకుంటే పైరుకు నత్రజని లభిస్తుంది. కంది, శనగ, పంటలను వరుసగా వేస్తే కాయతొలుచు పురుగుల తాకిడి ఎక్కువ. దీని నివారణకు జొన్న, సోయా చిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్టవరి(ఒట్టొరి) వంటి పంటలు వేసుకోవాలి. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసేవారు కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్య పంటలు వేసుకోవాలి. కంది, శనగ, మినుము పంటలను వేరుశనగతో మార్చుకోవచ్చు. వరి పైరును దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగజాతి కూరగాయ పంటలతో మార్పిడి చేసుకోవాలి. ఉల్లిరైతులు మరుసటి పంటగా ధాన్యపంటలు వేయాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజి పంటలపై లద్దె పురుగు తాకిడిని అధికట్టేందుకు జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు పంటలను వేయాలి.

ఎంపికలో జాగ్రత్తలు

పంట మార్పిడికి ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటను ఎంపిక చేసుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థతో నేల పైపొర పోషకాలను గ్రహిస్తాయి. అపరాలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయి. వాటి ఆకులు ఎరువుగా మారుతాయి. రేగడి నేలల్లో సోయా చిక్కుడు వేసుకుంటే పంట కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ ఎరువు లభిస్తుంది.

అధికారుల సూచనలు పాటించాలి



రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలి. ప్రతీ సంవత్సరం ఒకే పంట సాగుచేస్తే దిగుబడులు తగ్గుతాయి. పెట్టుబడి ఎక్కువ అవుతుంది. పంట మార్పిడితో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. దీంతో పంట ఉత్పత్తి, నాణ్యత పెరుగుతుంది.

- శంకర్‌లాల్, ఏవో చేవెళ్ల

ఏటా పంట మార్పిడి చేస్తే...

- నేల భూ భౌతికస్థితి మెరుగవుతుంది.
- భూమిలో నీటినిల్వ సామర్థ్యం పెరిగి భూసారం వృద్ధిచెందుతుంది.
- చీడపీడల నివారణ మరింత సమర్థంగా చేపట్టొచ్చు.
- సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర వ్యాధులను నివారించొచ్చు.
- కలుపు మొక్కలు, వాటి విత్తనాలు కొంత మేర నాశనమవుతాయి.
- పంటకు మేలుచేసే వానపాములు వృద్ధి చెందుతాయి.

ఇలా చేయొద్దు

పంట మార్పిడికి అనుకూల పంటలనే ఎంచుకోవాలి. లేదంటే చీడపీడల ఉధృతి మరింత ఎక్కువవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఈ రెండు పంటలపై ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయొద్దు. పసుపు తర్వాత మిరప, టమాట, క్యాబేజి, దోస, గుమ్మడి, సొర, బీర, పత్తి, బెండ వేయొద్దు. ఆకుముడత రోగం ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయాచిక్కుడు పంటలు వేసుకోవద్దు.


ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని షాపు యజమానికి నోటీసులు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిర్మూలించాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రవీంద్ర సాగర్ తెలిపారు. గురువారం షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా విధిస్తామని, షాపు లైసెన్స్ రద్దు చేస్తామంటూ హెచ్చరించారు. పాస్టిక్ కవర్ల వాడకంతో ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజలు కూడా వీటి వాడకాన్ని తగ్గించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచేలా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా పార్కు స్థలాల్లో మొక్కలు నాటేందుకు మున్సిపల్ సిబ్బంది గుంతలు తీశారు.

బాలికపై అత్యాచారయత్నం

దోమ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 13ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బాలికపై యాదయ్య(24) గురువారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఆమె ఇంట్లోకి చొరబడి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. బాలిక కేకలు వేయగా సమీప ఇళ్లలోని వారొచ్చి యాదయ్యను పట్టుకునేందుకు చూడగా అతడు పారిపోయినట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులొచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రైతుల ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తాం


అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి

యాచారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అందిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తామని ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. గురువారం మొండిగౌరెల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ భూ సంబంధిత సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజావసరాలకు ప్రభుత్వం భూసేకరణ చేసినా తగిన పరిహారం ఇస్తుందని తెలిపారు. మొండిగౌరెల్లిలో 19, 68, 127 సర్వే నంబర్ల అసైన్డ్ పరిశీలించారు. తమ పంట భూములు తీసుకోవద్దని రైతులు ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ టి.అయ్యప్ప, ఆర్ఐలు రామకృష్ణ, డీటీ కీర్తిసాగర్ తదితరులున్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత


కొడంగల్-తాండూర్ రోడ్డుపై గుంతల పూడ్చివేత ఇలా..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొడంగల్ రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు నిర్మిస్తున్న కొడంగల్-తాండూర్ జాతీయ రహదారి గుంతలమయమైంది. వాహనదారుల ఇబ్బందులపై మే 30న 'రహదారి గుంతలమయం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం గుంతల్లో కంకర, మట్టి పోయించారు.

ఐపీఎల్ చాలెంజ్.. యువకుడి వింత చేష్టలు

మెడలో చెప్పుల దండతో హల్‌చల్


మెడలో చెప్పుల దండ వేసుకున్న సాయి

తాండూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్-25 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్-బెంగళూరు(ఆర్సీబీ) గెలిస్తే తాను మెడలో చెప్పుల దండతో ఊరేగుతానని తాండూరుకు చెందిన సాయి అనే యువకుడు రీల్స్ చేసి ఇన్‌స్టగ్రామ్‌లో వైరల్ చేశాడు. పోటీల్లో ఆర్సీబీ విజయం సాధించడంతో పెద్దేముల్ మండలం కందనెల్లి తండాకు చెందిన సాయి గుండు చేయించుకొని, మెడలో చెప్పుల దండతో తాండూరు బస్టాండ్‌లో తిరిగిన వీడియోను మరోసారి వైరల్ చేశాడు. ఇలా చేయడం తనకు సంతోషంగా ఉందని ఆ వీడియోలో చెప్పాడు. గతంలో క్వాలిఫైయర్‌లో పంజాబ్ గెలిస్తే చొక్కా లేకుండా తిరుగుతానని చెప్పిన సాయి.. అదె టీం గెలవడంతో తాండూరు ఇందిర చౌక్ వద్ద చొక్కా లేకుండా తిరిగి వీడియోను అప్‌లోడ్ చేశాడు. ఆ యువకుడికి పిచ్చి ముదిరిందని నెటిజన్లు స్పందించారు. ఇదిలా ఉంటే వింత చేష్టలు చేసిన సాయిని, అతడి తల్లిదండులను తాండూరు టౌన్ సీఐ సంతోశ్‌కుమార్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పి పంపించారు.

ఔషధ గుణాల అల్లనేరేడు

- పండ్లకు యమ క్రేజ్! ● కిలో రూ.300
- జోరందుకున్న అమ్మకాలు
- ధర ఎంతున్నా తినాలంటున్న వైద్యులు



పరిగి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా వచ్చే అల్లనేరేడు పండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో కాపుకొచ్చే అల్లనేరేడు పండ్లను తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. అల్లనేరేడులో చాలా ఔషధ గుణాలున్నాయి. వీటిని తింటే ఆరోగ్యానికి మేలని ప్రజల నమ్మకం. వైద్యులూ అదే చెబుతున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ పట్టణాల్లో బండ్లపై అల్లనేరేడు పండ్లు విరివిగా అమ్ముతున్నారు. నాణ్యత కలిగిన కిలో పండ్లు రూ.250 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. ఈ ప్రాంత పొలాల్లో, అడవుల్లో లభించే పండ్లు మార్కెట్లలో అమ్ముతున్నారు. పరిగి, వికారాబాద్‌లలో ఏ రోడ్డులో చూసినా అల్లనేరేడు పండ్ల అమ్మకాలు కన్పిస్తున్నాయి. కాగా పూడూరు, దోమ, ఊటుపల్లి గ్రామాల్లో నల్లనేరేడు తోటలను సాగుచేస్తున్నారు. పండ్లను రైతులు హైదరాబాద్, ఇతర పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఆరోగ్యానికి మేలు చేసే పండు



అల్లనేరేడు పండ్లలో ఔషధ లక్షణాలు ఎక్కువ. ఈ పండ్లు తింటే శరీరానికి చలువ చేస్తుంది. వేడి తగ్గుతుంది. డయాబెటిస్(మధుమేహ) రోగులకు ఇది చేసే మేలు ఎంతో. శరంలోని చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. సీజన్‌లో ప్రతి ఒక్కరు రోజుకు కనీసం పది పండ్లయినా తింటే ఎంతో మంచిది. కిడ్నీ వ్యాధులను అల్లనేరేడు నయం చేస్తుంది. చిన్నసైజు రాళ్లుంటే ఈ పండ్లు ఎక్కువ తింటే కరిగిపోయే అవకాశం ఉంది. ఇలా ఒకటి, రెండు వ్యాధులకే కాకుండా మల్టీ విటమిన్ గల ఈ ఫ్రూట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ధర ఎంతున్నా ఈ పండు తినడం అందరికీ ఎంతో మంచిది.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి


కమిషనర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌లో తాగునీటి సమస్య తీర్చండి

మేడ్చల్ టౌన్ జూన్ 5(ఆంధ్రజ్యోతి):మేడ్చల్ మున్సిపాలిటీ ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ పట్టణ నాయకులు ఆరోపించారు. నాయకులు కమిషనర్ నాగిరెడ్డి గురువారం కార్యాలయంలో సమావేశమై సమస్యలపై వివరించారు. ప్రతీ బస్తీలో మూడు నాలుగు రోజులకోసారి నల్లా వస్తోందని, కనీసం రోజువిడిచి రోజైనా నల్లా వదలాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు చేపడుతున్నా బిల్లులు రావడం లేదని ఫిర్యాదు చేశారు. పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారిని కోరారు. సమావేశంలో నాయకులు శైలజ, మురళీధర్ గుప్తా, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి కాలుష్యాన్ని పారదోలి, ప్రకృతి విధ్వంసాన్ని నిర్మూలించాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఆకుపచ్చని తెలంగాణగా అభివృద్ధి చేసుకోవాలన్నారు.


చేవెళ్ల : మొక్కలు నాటే కార్యక్రమంలో సివిల్ జడ్జి దశరథ రామయ్య


కొత్తూర్ : మొక్కలు నాటి నీరు పోస్తున్న చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్


కేశంపేట : మొక్కలు నాటుతున్న మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలా శ్రవణ్ రెడ్డి


ఆదిభట్ల : మంగల్‌పల్లిలో మొక్క నాటుతున్న కమిషనర్ బాలకృష్ణ


చౌదరిగూడ : మొక్కలు నాటుతున్న అధికారులు





కడ్తాల్ : మొక్కలు నాటుతున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గ్రీన్ ఇండియా చాలెంజ్ కల్వకుర్తి ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు


షాద్‌నగర్ అర్బన్ : మొక్కలు నాటే కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్



షాబాద్ : మొక్కలు నాటుతున్న ఎంపీడీవో అపర్ణ తదితరులు



ఇబ్రహీంపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డా.రాధిక తదితరులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి

మంచాల/ఇబ్రహీంపట్నం, జూన్ 5(ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నదాతలకు సూచించారు. మంచాల మండల పరిధి తాళ్లపల్లిగూడ, రంగాపూర్, ఇబ్రహీంపట్నం మండల పరిధి నాగన్‌పల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఎమ్మెల్యే రంగారెడ్డి తాళ్లపల్లిగూడ, నాగన్‌పల్లిలో జరిగిన సదస్సుల్లో పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్‌డీవో అనంతరెడ్డి, తహసీల్దారు ప్రసాద్‌రావు, ఎంపీడీవో బాలశంకర్, మాజీ సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జి.లచ్చిరెడ్డి, ఆర్‌ఐలు తదితరులున్నారు.


మంచాల : తాళ్లపల్లిగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

కడ్తాల్ : రైతులు భూ సమస్యలను సదస్సుల్లో తెలిపి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ముంతాజ్ సూచించారు. మండలంలోని చల్లంపల్లి, రావిచెడ్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రావిచెడులో తహసీల్దార్ ముంతాజ్, చల్లంపల్లిలో డీటీ ఆదిత్య రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. నాయకులు నరేందర్, సురేందర్‌రెడ్డి, అశోక్, విటలయ్యగౌడ్, గోపాల్, డాక్టర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కడ్తాల్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ముంతాజ్

కొత్తూర్ : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారించుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీటీ జంగయ్యలు అన్నారు. సిద్దాపూర్, గుడూరులో సదస్సులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారిస్తామన్నారు. ఆర్‌ఐలు సంజీవ, రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

షాబాద్ : భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలు పరిష్కారం అవుతుందని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండల పరిధిలోని సోలిపేట్, కేసారంలో రెవెన్యూ సదస్సులను సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. తహసీల్దార్ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, గ్రామస్తులు శ్రీరాంరెడ్డి, రాంరెడ్డి, రైతులు, తదితరులు ఉన్నారు.


షాబాద్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చౌదరిగూడ : భూ సమస్యలు రెవెన్యూ సదస్సులతో పరిష్కారించుకోవచ్చని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ అన్నారు. మండల పరిధిలోని పద్మారం, తుమ్మలపల్లిలో సదస్సులు నిర్వహించారు. 61 దరఖాస్తులకుగాను 25 దరఖాస్తులను తిరస్కరించినట్లు తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. డీటీ రాకేష్, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్, రామస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు తెలిపారు. తహసీల్దార్ గోపాల్‌తో కలిసి మండలంలోని పులిమామిడిలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. డీటీ శేఖర్, ఆర్‌ఐలు నాయకులు పాండురంగారెడ్డి, మల్లయ్య, రవీందర్ తదితరులున్నారు.

కేశంపేట : కొత్తపేట, బైర్కాన్‌పల్లి గ్రామాలలో గురువారం సదస్సులు నిర్వహించారు. కొత్తపేటలో తహసీల్దార్ ఆజంఅలీ, బైర్కాన్ పల్లిలో డీటీ గీత బృందం సదస్సులు నిర్వహించారు. ఈమేరకు బైర్కాన్‌పల్లి 25 దరఖాస్తులు రాగా, కొత్తపేటలో 10 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.


కొత్తూర్ : సిద్దాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

మున్నూరు కాపుల ఐక్యతకు పాటుపడాలి

మాడ్గుల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపుల ఐక్యతకు పాటుపడాలని జిల్లా మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు సింగం రాజు అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మున్నూరు కాపులు సమస్యలతో సతమతమవుతున్నారని కొందరు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో చక్రపాణి, సింగం గోవర్ధన్, డాక్టర్ సింగం నర్సింహ, సింగం వెంకటయ్య, సింగం రాజు, సింగం శ్రీనయ్య, సింగం చెన్నయ్య, సింగం శేఖర్‌సింగం రాములయ్య తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మాడ్గుల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన ఆరెకంటి యాదమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ.3వేల ఆర్థిక సాయం సమకూర్చారు. గురువారం ఆయన అనుచరులు బీఆర్‌ఎస్ నాయకులు కొప్పుల శివకుమార్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ గ్యార వెంటయ్య, కొప్పుల శ్రీరాములు, మాజీ వైస్ ఎంపీపీ రామస్వామి, గ్యార విజయ్, ఐలబోని బక్కయ్య తదితరులు పాల్గొన్నారు

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

యాచారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బైక్(బుల్లెట్) అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో బైకిస్ట్ దుర్మరణం చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గడ్డమల్లాయగూడ గ్రామానికి చెందిన గౌర శ్రీకాంత్(22) ఆదిభట్లలోని ఓ ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో తన బైక్‌పై ఇంటికి వస్తుండగా అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఎడ్లబండిని బైక్ ఢీకొనడంతో మరొకరు..

మాడ్గుల, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ఎడ్లబండిని బైక్‌తో వెనకాల నుంచి ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన అన్నెబోయినపల్లి గేటు సమీపాన చోటుచేసుకుంది. సీఐ వేణుగోపాల్ కథనం మేరకు.. నల్గొండ జిల్లా, చింతపల్లి మండలం, మల్లారెడ్డిపల్లికి చెందిన కొడిదెల భారతయ్య(28) తన చెల్లెలి గ్రామం మల్లేపల్లికి ఈనెల 3న వెళ్లాడు. తిరిగి బుధవారం స్వగ్రామం మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లికి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో అన్నెబోయినిపల్లి గేటు వద్ద ఎడ్లబండిని వెనకాల నుంచి ఢీకొట్టడంతో తలకు రక్తగాయాలయ్యాయి. స్థానికులు హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. మృతుడి సోదరుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి..

ఆమనగల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని నాగులబండ కాలనీకి చెందిన నారమోని మల్లేశ్ (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కల్వకుర్తిలోని బంధువుల వివాహ వేడుకకు హాజరై గురువారం రాత్రి తిరిగి ఆమనగల్లుకు వస్తున్న క్రమంలో వెల్దండ, చెరుకూరు గ్రామాల మధ్య శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై బైక్‌ను వెనకాల నుంచి కారు వేగంగా ఢీకొంది. దాంతో బైక్‌పై ఉన్న మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో ఆమనగల్లులో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

షాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామానికి చెందిన నక్కలపల్లి గణేష్(25) హైతాబాద్‌లోని వెల్‌స్పన్ కంపెనీలో పనిచేసేవాడు. బుధవారం సాయంత్రం హేర్‌కటింగ్ చేయించుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకూ తిరిగి రాకపోవడంతో తన తల్లి తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం గణేష్ బైక్ పొలం వద్ద ఉందని పక్కింటి వారు చెప్పడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తల్లి మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేకల దొంగల అరెస్టు

చౌదరిగూడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మేకలను అపహరించేందుకు యత్నించిన ముగ్గురు దుండగులను గ్రామస్థులు పట్టుకున్న ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. గురువారం స్థానికులు, ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తుమ్మలపల్లిలో బంగారు జంగయ్యకు చెందిన మేకలను తన వ్యవసాయ పొలంలోని కొట్టంలో ఉంచి రాత్రికి ఇంటికి చేరుకున్నాడు. బుధవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో ముగ్గురు యువకులు కొందుర్గు మండల కేంద్రానికి చెందిన పిచ్చకుంట్ల వంశీ, బోయ హరికృష్ణ, పిచ్చకుంట్ల ప్రశాంత్‌లు కారు డిక్కీలో 9 మేకలను ఎక్కించుకొని అపహరించేందుకు యత్నిస్తుండగా గ్రామస్థులు అక్కడికి చేరుకుని కారు యజమాని వంశీని పట్టుకున్నారు. గురువారం ఉదయం జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులకు అప్పగించారు. బంగారు జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, ముగ్గురిలో హరికృష్ణ పరారీలో ఉన్నాడని తెలిపారు.

వైభవంగా మల్లన్నస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలో వివిధ పార్టీల నాయకులు

కొత్తూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో మల్లన్నస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభంతో పాటు మల్లన్న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొత్తూర్ మాజీ ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మల్లన్న ఆలయాన్ని లక్షా 16వేల రూపాయల విరాళం అందజేశారు. పూజా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు అజయ్‌మిట్టునాయక్, అంబటి ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆగీర్ రవికుమార్‌గుప్త, యాదవ సంఘం నాయకులు నానవాళ్ల జంగయ్యయాదవ్, శ్రీరాములుయాదవ్, రమేష్‌యాదవ్, మహేష్‌యాదవ్, శ్రీను యాదవ్, నాయకులు లింగం నాయక్, దశరత్‌యాదవ్, గొడుగు రవి, ఇంద్రసేనారెడ్డి, శేఖర్ ముదిరాజ్, గుర్రంపల్లి శ్రీశైలం, శేఖర్‌యాదవ్, రాజుయాదవ్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు : కసిరెడ్డి

ఆమనగల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పేదల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్‌రెడ్డి సాహోసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణనాయక్, అప్పం శ్రీను, ఎంగలి ప్రసాద్, ఖాదర్, సురేశ్ నాయక్, శ్రీకాంత్, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, బాబా, నరేశ్, ఫరీద్, రఫీ, నాజర్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి


చౌదరిగూడ : కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రిలో ప్రొసీడింగ్ అందిస్తున్న నాయకులు

కడ్తాల్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పథకాలు రూపొందించి అమలు చేస్తుందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు హీరాసింగ్, తులసి రామ్‌నాయక్, జవహర్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూర్ చేస్తుందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంకీ శ్రీను, మాజీ వార్డు సభ్యులు రాంచందర్, మాలే మల్లేశ్, జహంగీర్ అలీ, సత్యం, భాను కిరణ్, తదితరులున్నారు. కడ్తాల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూర్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని ఎంపీడీవో సుజాత ప్రకటనలో కోరారు.

చౌదరిగూడ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రి, ఉత్తరాస్‌పల్లిలో ప్రొసీడింగ్స్ అందజేశారు. కాంగ్రెస్ నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, రాంచంద్రయ్య, శివ, పైల్వాన్ తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్ : ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నాయకులు

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

యాచారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి) సహజ పద్ధతులు పాటిస్తూ అధునాతన పరికరాలను వాడుతూ, రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుంటూ పంటలు సాగు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రియ, డాక్టర్ రామకృష్ణలు సూచించారు. గురువారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖరీఫ్ పంటల సాగు నిమిత్తం సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినం ప్రతీయేటా జరుపుతున్నాం కాని, పర్యావరణానికి కీడు చేసేలా రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడి నేలను పాడు చేసుకుంటున్న విషయం గమనంలో పెట్టుకోవాలని రైతులను కోరారు. కేంద్ర ప్రభుత్వం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం కింద రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. ఏవో రఘునాథ్ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ పి.రామకృష్ణ, డాక్టర్ గౌతమ్, డాక్టర్ చౌహన్, డాక్టర్ గురవ, డాక్టర్ దిలిప్ తదితరులున్నారు.

పంట మార్పిడితో ఎంతో మేలు

మాడ్గుల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతీయేటా ఒకే రకమైన పంటు సాగు చేయకుండా పంటమార్పిడి చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ రైతులకు సూచించారు. మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామంలోని రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ పంట మార్పిడి, నూతన వంగడాలు, పంటలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు వాడాలని, యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు ప్రియాంక, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మాస్టార్లు!

(ఐదో పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు కృషి చేయనున్నారు. నాణ్యమైన విద్య, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, భోజన వసతి వంటి వాటి గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు. టెన్త్‌లో పిల్లలు సాధించిన ఫలితాలను వివరించనున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

- 6వ తేదీన స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ పెద్ద ఎత్తున గ్రామ సభ నిర్వహించాల్సి ఉంటుంది.
- 7న ఉపాధ్యాయులు ఇంటింటినీ సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాలి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది..
- 8,9,10వ తేదీల్లో జిల్లాలోని ఉపాధ్యాయులు తమతమ పాఠశాల పరిధిలో కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలి. ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే వారిని అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాల్సి ఉంటుంది.
- 11న అప్పటి వరకు నిర్వహించిన బడిబాటపై సమీక్షించుకోవాలి.
- 12న అమ్మ ఆదర్శపాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించి అదే రోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, స్కూల్ యూనిఫామ్స్ అందించాల్సి ఉంటుంది.
- 13న జిల్లాలో సామూహిక అక్షరాభ్యాసం బాలల సభను నిర్వహించాలి.
- 16న ఎఫ్ఎల్ఎన్, లిప్ దినోత్సవం నిర్వహించాలి. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల దినోత్సవం, తరగతి గదుల్లో విషయాల వారీగా అభ్యసనా సామర్థ్యాల గోడ ప్రతుల ప్రదర్శన, పిల్లలు రూపొందించిన చార్టులతో గదుల అలంకరణ, చదవడంతో పాటు గణిత సంబంధిత వాటిపై క్విజ్ పోటీలు.
- 17న విలీన విద్య, బాలికా దినోత్సవాన్ని చేపట్టాలి. సమీకృత విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహణ, బాలికా వివాహాలు, చిన్నారులపై వేధింపులను అరికట్టాలని ప్రతిజ్ఞ.
- 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన కల్పించి, మొక్కల పెంపకం, ప్రాధాన్యాన్ని వివరించాలి.
- 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించాలి.

ఘనంగా కొండల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ఆమనగల్లు/షాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆమనగల్లు పట్టణంలో గురువారం అట్టహాసంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, చెంచు సేవా సంఘం రాష్ట్ర నేత మండ్లి రాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు రవీందర్‌నాయక్, రేవంత్ మిత్రమండలి ఉపాధ్యక్షుడు ఆనంద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కేక్ కట్‌చేసి ప్రజలకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు మొక్కలు నాటారు. కొండల్‌రెడ్డికి ఫోన్‌లో నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మానయ్య, ఆమనగల్లు, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తెల్లమల్ల జగన్, బీచ్యానాయక్, సీనియర్ నాయకులు కేశవులు, కాలె మల్లయ్య, ఆనంద్‌గౌడ్, కొండల్‌రెడ్డి, పూసలి వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేందర్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఫరీద్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు. కొండల్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.




కేక్ కట్ చేస్తున్న నాయకులు, కొండల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి